విజయవాడ వార్త

## కూటమి ప్రభుత్వ విజయానికి కార్యకర్తలే తొలిమెట్టు

పెడన జూన్7,ప్రభాతవార్త : ప్రజల వద్దకు వెళ్ళే ప్రతి కార్యకర్త కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పెడన నియోజకవర్గ శాశనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ సూచించారు.పెడన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం మండలస్థాయి నాయకులు,క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, బిఎల్ఏ,ఎస్ఐఆర్ నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైనవని ప్రతి ఓటు మన విజయానికి పునాది అని గుర్తుచేసారు.ఈ నేపథ్యంలో బూత్‌లెవల్ ఏజెంట్లు,ఇన్‌ఛార్జ్‌లు పార్టీ కార్యకర్తలతో సమావేశమై ఓటర్‌మ్యాపింగ్ పార్టీ సంస్థాగత బలోపేతంపై సమీక్ష నిర్వహించారు.ప్రతిఒక్కరూ మై టిడిపి యాప్‌ను వినియోగించాలని కోరారు.



## సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

-ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ

విజయవాడ, జూన్ 7, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలో మీడియా తో కమిటీ రాష్ట్ర చైర్మన్ గుర్రంకొండ సురేంద్ర ఆదివారం మాట్లాడుతూ త్వరలో ఉన్నతాధికారులకు తాము సమావేశంలో చర్చించిన సమస్యల పరిష్కారానికి సంబంధించి సమగ్ర వినతిపత్రం అందజేస్తామని, హామీల అమలులో ప్రభుత్వం నిరక్ష్యాన్ని వీడకపోతే ఉద్యమ కార్యాచరణ తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్, అసోసియేట్ చైర్మన్ పిల్లి హరీశ్, కోచైర్మన్లు చేవూరి వెంకట్, గంటా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## కంచికచర్లలో యోగ శిక్షణ తరగతులు

కంచికచర్ల జూన్ 06 ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆగస్త్య పీఠము ట్రస్ట్ ఆద్వర్యంలో సుగణానంద మహర్షి ఆశీస్సులతో ఈనెల 7వ తేదీ నుంచి పది రోజుల పాటు కంచికచర్ల మార్కెట్ యార్డ్ ఆవరణలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందిని సుగుణానంద మహర్షి తెలియపరిచారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని మన రోజువారి జీవితంలో పెరిగే ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలు, ఆందోళనలు అధిగమించడానికి యోగ అత్యంత ఔషదము అని తెలియజేశారు. కావున ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి 8వ ఏదీ నుంచి ఉదయం సాయంత్రం 5:30 నంఉచి 7 గంటల వరకు యోగా శిక్షన తరగతులు జరుగుతాయి. ఈ శిక్షణ తరగతుల సమయంలో అమృత హారము అందించబడును అమృత హారము కావాల్సిన వారు తన పేర్లను నమోదు చేయించుకోగలరి యోగ గురువు శివానంద స్వామీజీ తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

కంచికచర్ల జూన్ 06 ప్రభాతవార్త: కంచికచర్ల పట్టణం రైతుబజార్ రైతుబజార్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పరిటాల గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ తన స్నేహితుడుషరీఫ్ బుడేతో కలిసి యాక్టివా ద్విచక్ర వాహనంపై కంచికచర్ల నుండి తమ ఇంటి అవసరాల కోసం నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దోనబండ వైపు నుంచి కంచికచర్లకు కంకర లోడుతో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా మరియు అతి వేగంగా ట్రాక్టర్ నడపడంతో ద్విచక్ర వాహానాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ మహమ్మద్ రఫీ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గొల్లపూడి లోని ఆంధ్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న షరీఫ్ బుడేకు గాయాలు కావడంతో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతిడి భార్య షేక్ అమీనా కౌసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచికచర్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతామని స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతామని కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్ తెలియజేశారు.



## రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుతో మలుపులో ప్రమాదాలకు చెక్

ఎ కొండూరు, జూన్ 7, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో మైలవరం ఎసిపి ప్రసాదరావు తిరువూరు సిఐ గిరిబాబు ప్రత్యేక చొరవతో లక్ష్మీపురం నుండి విసన్నపేట వెళ్లే రహదారి



ఎన్‌హెచ్ 216 హెచ్‌లోని ప్రమాదకర మలుపుల వద్ద ప్రమాదాల నివారణ కొరకు రంబుల్స్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు తిరువూరు సిఐ శనివారం గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు ప్రయాణీకులు ద్విచక్రవ వాహన చోదకులు సిపి రాజశేఖర్ బాబును రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ మైలవరం ఎసిపి ప్రసాదరావును తిరువూరు సిఐ గిరిబాబును, తిరువూరు ఎస్సై శాతకర్ణిని ప్రశంసించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని ప్రజలు వాహనదారులు తగు రోడ్డు సేఫ్టీ జాగ్రత్తలు సిఐ గిరిబాబు కోరారు.

## హైవే మార్జిన్‌లో ఆక్రమణల జోరు..

### - అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

ఎ కొండూరు, జూన్ 7, ప్రభాతవార్త : ఇబ్రహీంపట్నం మైలవరం తిరువూరు జాతీయ రహదారి-30పై ఎ కొండూరు మండలం చీమలపాడు సెంటర్‌లో అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాలు కార్లు హైవే రహదారికి ఆనుకుని కాంప్లెక్స్ యజమానులు మట్టిదిబ్బలతో రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించుకోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైడ్ ఇచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ గ్రామంలో జాతీయ రహదారి మార్జిన్ దాటి సైతం ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నా ఎన్‌హెచ్ విజయవాడ అధికారులు గాని, పోలీసులు గాని ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంతో హైవే మార్జిన్ మొత్తం ఆక్రమణలకు గురైంది. ఈ చీమలపాడు సెంటర్‌లో హైవే రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించుకుని ప్రమాదాల నివారణకు కారణమవుతున్న కాంపెక్స్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే ఆక్రమణలు తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



## యోగా పోటీలు

విజయవాడ తూర్పు, జూన్ 7 (ప్రభాతవార్త): సమాజంలోని ప్రతి వర్గానికి యోగా పట్ల అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్ర2026లో భాగంగా ఈ నెల 7 నుంచి యోగా పోటీలునిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిలో అందరికీయోగా- ఆరోగ్యం ఇతివృత్తంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## తల్లికి వందనం పథకానికి బ్యాంకు ఖాతాలు అనుసంధానం చేసుకోవాలి

విజయవాడ తూర్పు జూన్ 7 (ప్రభాతవార్త) : ఎస్.సి కులములకు చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులు జూన్ 11 వ తేదీలోపు నూతన బ్యాంకు ఖాతా ఓపెన్ చేసుకుని ఎన్.పి.సి.ఐపోర్టల్ లో అనుసంధానం చేయించుట కోవాలని జిల్లా ఎస్.సి సంక్షేమ సాధికారిత అధికారి కె.ఎల్. హర్షిత ఒక ప్రకటనలో తెలిపారు. నూతన బ్యాంకు ఖాతాను ప్రారంభించేందుకు విద్యార్థులు పాన్ కార్డు అవసరం లేకుండా ఆధార్ కార్డు , ఆధార్ నెంబర్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా వారి గ్రామా సమీపములో గల స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు మరియు కెనరా బ్యాంకులలో కొత్త బ్యాంకు ఖాతాను తెరవవచ్చున్నారు. అర్హత కలిగిన (ఎస్.సి ) షెడ్యూల్డ కులములకు చెందిన విద్యార్థులందరూ వారి సమీపములోని స్వర్ణ గ్రామా/స్వర్ణ వార్డు సచివాలయాలను సంప్రదించి గ్రామా, వార్డు సంక్షేమ మరియు విద్యా సిబ్బంది ద్వారా పూర్తి వివరాలు తెలుసుకొని గడువు తేదిలోపు " విద్యార్థుల పేరిట నూతనముగా బ్యాంకు ఖాతా ను ప్రారంభించి, దానికి ఎన్ .పి .సి ఐ పోర్టల్ నందు అనుసంధానము చేయు ( లింకింగ్) ప్రక్రియను పూర్తి చేసుకోవాలని" జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కోరారు.

## యోగాను అందరూ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలి : రాష్ట్ర హోం మంత్రి అనిత

విజయవాడ కార్పొరేషన్,జూన్ 7,ప్రభాతవార్త: యోగాను అందరూ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వి.అనిత పేర్కొన్నారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్,ఆరోగ్య ఆంధ్రప్రదేశ్,ఆనంద ఆంధ్రప్రదేశ్ కావాలని ఆమె పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేటి నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో



ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో బిఆర్‌టిఎస్ రోడ్డు వద్ద పోలీసు శాఖలో మానసిక,శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి సిపి రాజశేఖరబాబు అధ్వర్యంలో పెద్ద ఎత్తన పోలీసులు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు,సిఎం ఆదేశాల మేరకు ఆదివారం ఇంత మంది ఒకే వేదిక మీద మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోడాలని ఒక మంచి నినాదంతో ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఏ కార్యక్రమం చేసినా సిపి రాజశేఖరబాబు తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిలో చేస్తుంటారని, పోలీస్ థీమాటిక్‌గా యోగా చేయాలంటే ఏపిలో విజయవాడ కమీషనరేట్‌ను బెస్ట్ ప్లేస్‌గా చెప్పుకోవచ్చన్నారు. ఇక్కడ ప్రతి ఒక్కరి నుండి సపోర్టు చాలా ఉంటుందన్నారు. 5వేల సంవత్సరాల క్రితం నుంచి భారత సంస్కృతిలో మన పరిసరాల్లో ఉన్న యోగా అనే కార్యక్రమాన్ని నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్యాలెండర్ లోకి తీసుకెళ్ళి పెట్టిన ఘనత మాత్రం ప్రధాని నరేంద్రమోడీకే దక్కిందన్నారు. 2014 తర్వాత ఐక్యరాజ్యసమితి వేదికపై యోగాంధ్ర చేయాలంటే సుమారుగా 150 దేశాలు ఏకగ్రీవంగా ఆ రోజు



ఆమోదించాయన్నారు. యోగాని ప్రతి సంవత్సరం యోగా డే ని ప్రపంచవ్యాప్తంగా సెలబ్రేట్ చేయడం...ఆనందంగా ఉందని, చిన్నవాళ్ళ దగ్గర నుంచి పెద్ద వాళ్ళ వరకు వయసుతో సంబంధం లేకుండా జిమ్‌కి వెళ్ళాలంటే ఖర్చుతో పని,యోగా చేయాలంటే ఒకటే మ్యాట్.పేదవాడైనా,ధనికుడైనా,వ్యాపారస్థుడైనా,ఉద్యోగస్థుడైనా ఎవరైనా యోగా చేయాలంటే ఒకటే మ్యాట్ కావాలని,జిమ్‌లు చేయాలంటే డిఫరెంట్ డిఫరెంట్ స్టేజెస్ ఉండచ్చన్నారు. అటువంటి యోగాను 14 రోజులు కాకుండా కంటిన్యూగా జీవితంలో భాగం చేసుకోవాలని కోరుకుంటున్నానన్నారు. జూన్ 21న యోగా డే సందర్భంగా చేయడోయే ఈ 14 రోజుల కార్యక్రమంలో స్టేట్‌వైడ్‌గా ఉన్న ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. చాలా చోట్ల చైతన్య ప్రోగ్రాం అని, సంకల్ప ప్రోగ్రాం అని ఇలా ముందుకు తీసుకెళ్థామంటే,ఇక్కడ మన వద్ద కూడా డ్రగ్స్‌పై దండయాత్ర 2.0 పేరుతో పాజిటివ్ వచ్చిన వారిలో ఒక పరివర్తన తీసుకునే విధంగా కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 15 రోజుల పాటు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారని,ఆరోగ్యకరమైన,ఆనందకరమైన సమాజం కోసం యోగా చేయాలని,మన శరీరం,మనసును అధీనంలో ఉంచుకునేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందనా ఏనరు. ప్రజలు అంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రను చేపట్టిందని,45 నిముషాల ఆసనాలతో అనారోగ్యాలు దరి చేరకుండా చూడవచ్చన్నారు. ఎటువంటి ఒత్తిడిని అయినా తట్టుకుని నిలబడేలా యోగా సహకరిస్తుందని, అన్ని వర్గాల ప్రజలు ఈ యోగాంధ్రలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంలో ఆచరించేలా అలవాటు చేసుకోవాలన్నారు.ప్రధాని,సిఎంలు దేశంలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని సందేశం అందించారన్నారు. యోగాంధ్రలో పోలీసు కుటుంబం భాగస్వామ్యం అయ్యిందని, సుమారు 5 వేల మందితో యోగాంధ్రలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర అనే కార్యక్రమాన్ని చేపట్టి..తర్వాత డ్రగ్స్‌పై దండయాత్ర 2.0 అనే కార్యక్రమాన్ని తీసుకొని, గంజాయి సేవిస్తున్నారో,వారిని గుర్తించి అటువంటి వారిని ఈ రోజు మనం జనజీవన స్రవంతి లోకి తీసుకొస్తూ...వారిని సన్మార్గంలో నడిపిస్తూ,ఆ డ్రగ్ పాజిటివ్స్ ఎవరైతే ఉన్నారో వారిని నెగిటివ్ అయ్యేంత వరకు చైతన్యంతో ముందుకు తీసుకెళ్ళాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ క్రమంలో ఒక యోగా ప్రోగ్రాంని కూడా స్టార్ట్ చేస్తే బాగుంటుందని,అనుకున్నామని, నేడు యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆ అవకాశం కలిసి రావడం చాలా సంతోషమన్నారు. నేడు దాదాపు 1000 పైచిలుకు డ్రగ్ పాజిటివ్స్ ఇక్కడ ఉన్నారని, గత నెల నుండి వారందరికీ కూడా మా హెల్త్ డిపార్ట్‌మెంట్,పోలీసు శాఖ,జిల్లా అడ్మినిస్ట్రేషన్ అంతా కలిసి, వారిని డ్రగ్స్ రహిత పౌరులుగా తీర్చిదిద్దేలా నమస్కరించే లాగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నెల 21వ తేదీన వాళ్ళందరూ కూడా నెగిటివ్ కావాలని ఆశిస్తున్నామన్నారు. మార్పుకు శ్రీకారం చుట్టే క్రమంలో యోగాంధ్రా అనే ఈ కార్యక్రమం రావడం చాలా సంతోషమన్నారు. ఇంత పెద్ద కార్యక్రమం,ఇంత పెద్ద లాజిస్టిక్స్ ఏర్పాటు చేయాలంటే అతిథుల నుండి కూడ సహాయ సహకారాలు అవసరమని,మార్ట్స్ చంటి,ఇంత భారీ ప్రోగ్రాంకి పోలీసు శాఖకి సహాయసహకారాలు అందచేయడం,ఈ డయాస్,స్క్రీన్స్ అన్ని వారు సమకూర్చడం,పోలీసు శాఖ పట్ల వారికి ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేస్తే వారి పని భారం,ఒత్తిడిలకు గురికాకుండా ఆరోగ్యం మెరుగుపడుతుందని,మనిషి ఆరోగ్యం వృద్ధి చేసుకోవాలంటే యోగా తప్పనిసరన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శన ఆకట్టుకున్నాయి. శ్వాసపై ఏకాగ్రత అనేది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందంటూ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ యోగా ఔత్సాహికులతో ధ్యాన సాధన చేయించారు. కార్యక్రమంలో ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ,జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా,మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర,డిసిపిలు కృష్ణకాంత్‌పటేల్,షిరీన్ బేగం,కె.తిరుమలేశ్వరరెడ్డి,కెజివి సరిత,ఎస్‌విడి ప్రసాద్,ఈగల్ ఎస్‌పిలు నగేష్,స్వరూపరాణి,ఎన్టీఆర్ జిల్లా లా అండ్ ఆర్డర్,ట్రాఫిక్,ఇంటెలిజెన్స్, అక్టోపస్,ఎస్ఎస్.జి., ఐఎస్‌డబ్ల్యూ,హోంగార్డ్స్,సైబర్ సోల్జర్స్,సురక్ష,ట్రాఫిక్ అంబాసిడర్స్,ఆయుష్ యోగా డిపార్ట్‌మెంట్ డాక్టర్ ప్రియదర్శిని పర్యవేక్షణలో పెద్ద ఎత్తున యోగా ఔత్సాహికులు సుమారు 5వేల మంది పాల్గొని యోగాసనాలను అభ్యసించారు.

## ప్రతిరోజు యోగాసనాలు ధ్యానంతో ఆనందం ఆరోగ్యం

తిరువూరు, జూన్ 7, ప్రభాతవార్త : తిరువూరు టౌన్‌యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో ప్రత్యేక యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో ఏ.కుమార్‌రాష్ట్రంలో కోటి మందిని భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్న ఆర్డీవో కొంత సమయం ప్రజలు ప్రతిరోజు యోగాసనాలు ధ్యానానికి కేటాయిస్తే ఆనందం ఆరోగ్యం దక్కుతాయని ఆర్డీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## పరిశ్రమల స్థాపన పేరుతో పేద రైతుల సాగుభూములు స్వాధీనం చేసుకోవాలనే ఎన్‌డిఎ ప్రభుత్వ తీరు అన్యాయం ...

ఎ కొండూరు, జూన్ 7, ప్రభాతవార్త : రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి పేరుతో గ్రామాల్లో పేద రైతుల నోట్లో మట్టికొట్టాలనే కుటిలయత్నం చేస్తుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ విమర్శించారు. మండలంలోని చీమలపాడు రెవిన్యూ పరిధిలోని రామచంద్రాపురం లక్ష్మీపురం కోమటికుంట గ్రామాలకు చెందిన నిర్ణయానికి వ్యతిరేకంగా చేస్తున్న నిరసన ఆందోళన కార్యక్రమాలకు డివికృష్ణ మద్దతు తెలిపారు. సుమారు 70ఏళ్లుగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న పేద రైతుల భూములను స్వాధీనం చేసుకోవాలని సర్వేల పేరుతో రైతులను భయభ్రాంతలుకు గురి చేయడం దుర్మార్గమని కృష్ణ ఆక్షేపించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పేరతో లక్షలాది ఎకరాల భూములు సేకరించిందని, కాని ఎక్కడా పరిశ్రమలు స్థాపించకుండా నిరుపయోగంగా పడివున్నాయని డివి కృష్ణ ఆరోపించారు. గత నెల 24న రైతులకు సమాచారం ఇవ్వకుండా బదిలీలు పేరుతో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నించిందని రైతులు సంఘటిత పోరాటంలో అడ్డుకున్నారని ఇది రోతు పోరాట చరిత్రలో ఒక ముఖ్య ఘట్టమని ఈ ఉద్యమం ఆగకుండా మరింత బలోపేతం చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులను మండల అధ్యక్షుడు ఎన్.మోహన్‌రావు జిల్లా నాయకుడు ఎ.అమ్మిరెడ్డి వ్యకా మండల కార్యధ్యక్షుడు ఆనందరావు, పోరాట కమిటీ సభ్యులు వేములకొండ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



## భాష్యం రామకృష్ణకు రాజ్యసభ సీటుపట్ల ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హర్షం

ఎ కొండూరు, జూన్ 7, ప్రభాతవార్త : అంకితభావం కృషి పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి ప్రజా సేవలో తనదైన ముద్రవేసిన శ్రీ భాష్యం రామకృష్ణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నారా లోకేష్‌బాబు రాజ్యసభ పెద్దల సభకు సీటు ఇచ్చి రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేయడం హర్షణీయమని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సహజంగా పెద్దల సభకు మేధావులు విద్యావంతులకు కేటాయిస్తారని శ్రీ భాష్యం రామకృష్ణ విషయంలో సిఎం చంద్రబాబు, లోకేష్‌బాబు తీసుకున్న నిర్ణయం గొప్ప నిర్ణయమని శ్రీ భాష్యం రామకృష్ణ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు సాధించి ప్రజలకు నిస్వార్ధంగా పారదర్శకంగా సేవచేయాలని, రైతు బిడ్డ నుండి రాజ్యసభ వరకు పెద్ద పరిమి గ్రామం నుండి పెద్దల సభకు ఎంపిక కావడం శ్రీ భాష్యం రామకృష్ణ పూర్వజన్మ సుకృతమని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వెల్లడిస్తూ శ్రీ భాష్యం రామకృష్ణకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.



## యోగా సాధన ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యం : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,జూన్ 7,ప్రభాతవార్త: యోగా సాధన ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి,సానుకూల థృక్పథం పెంపొందుతుందని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు యోగాంధ్ర-2026 కార్యక్రమం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో అంగరంగ వైభవంగా ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడం,ఆరోకరమయైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమం తొలి రోజున విజయవాడ నగరం లోని రివర్ ఫ్రంట్ పార్క్,కృష్ణలంక,భవానీపురం,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనం ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని యోగాలో శిక్షణ పొందాలని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకొని, ఆరోగ్యవంతులుగా,ఆనందంగా జీవించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నగరంలోని ముఖ్యమైన పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ రానున్న రోజుల్లో కూడా నగరం లోని వివిధ ప్రాంతాల్లో యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించి, ఎక్కువ మంది ప్రజలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు యోగా ఒక ఉత్తమ సాధనమని, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యోగాంధ్ర కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విజయవాడ కార్పొరేషన్,జూన్ 7,ప్రభాతవార్త: నేడు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కూడ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గర లోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.




## పశ్చిమలోని అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

విజయవాడ, జూన్ 7(ప్రభాతవార్త): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని జెండా చెట్టు, గాంధీ హిల్ అవుట్ ఫాల్ డ్రైనేజీ, నైజాం గెట్ అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని శాసనసభ్యుడు సుజనా చౌదరి పేర్కొన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం ఆయన విజయవాడ పాతబస్తీలోని జెండా చెట్టు, గాంధీ హిల్ అవుట్ ఫాల్ డ్రైనేజీ ప్రాంతాలలో పర్యటించి డ్రైనేజీ సమస్యలను ఎన్డీఏ కూటమి మాజీ కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం కోసం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి సమగ్రమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.వర్షపు నీరు వెళ్ళటానికి స్టార్మ్ వాటర్ డ్రైన్స్ నిర్మించాలని భారీ వర్షాలకు మురుగునీరు పొంగిపొర్లకుండా రైల్వే ట్రాక్ క్రింద పూడిక తీయించాలని, వర్షపు నీరు త్వరగా బయటకు పోయేటట్టు తగిన ఏర్పాట్లు చేయాలని మాజీ కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ కోరారు. బ్రిటిష్ కాలం నాటి (దశాబ్దాల క్రితం) వేసిన నైజాం గేట్, గాంధీ హిల్ అవుట్ ఫాల్ డ్రైనేజీ వ్యవస్థను, పెరిగిన జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ పైపులను ఆధునికరించాలని కూటమి మాజీ కార్పొరేటర్లు ఎమ్మెల్యే సుజనా చౌదరిను కోరారు.మాజీ కార్పొరేటర్లు బుల్లా విజయకుమార్, మరుపిళ్ళ రాజేష్, అట్లూరి పెదబాబు, టీడీపీ నాయకులు కొప్పుల గంగాధర్ రెడ్డి బీజేపీ నాయకులు రెడ్డి పల్లి రాజు, మంగళపురి మహేష్, పలువురు జనసేన నాయకులుఈ పర్యటనలో పాల్గొన్నారు.

## ఆధునిక సదుపాయాలతో ఆంధ్రా క్రికెట్ లీగ్ పోటీలు

విజయవాడ, జూన్ 7 (ప్రభాతవార్త): ఈ నెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విశాఖ, కడప, మంగళగిరి నగరాలలో నిర్వహించనున్న ఆంధ్రా క్రికెట్ లీగ్ పోటీలు అత్యంత ఆధునిక సదుపాయాలతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్ల ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఎ.సి.ఎ. ఉపాధ్యక్షుడు సానా సతీష్ తో పాటు శనివారం విజయవాడలోని ఎ.సి.ఎ. కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీఎల్2026దేశంలోనే ప్రముఖ క్రికెట్ గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా మరో చారిత్రాత్మక అడుగుగా నిలవనుందని పేర్కొన్నారు. ఈసారి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో పోటీలు నిర్వహించడం ద్వారా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ను అన్ని ప్రాంతాల యువతకు చేరువ చేయనున్నామని ఆయన తెలిపారు. విశాఖ, కడప, మంగళగిరి వేదికల్లో అత్యాధునిక సదుపాయాలతో మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి వాతావరణంలోఫ్లడ్‌లైట్ల వెలుగులో జరిగే పోటీలు ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తాయని పేర్కొన్నారు.భవిష్యత్తులో మంగళగిరిని రాష్ట్ర క్రికెట్‌కు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**"క్రీడలతో పాటు ఆంధ్ర సంస్కృతి వైభవం"**

ఏపీఎల్‌ను కేవలం క్రికెట్ టోర్నీగా కాకుండా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటే ఉత్సవంగా తీర్చిదిద్దుతున్నామని చిన్ని తెలిపారు.తోలుబొమ్మలాట, కోలాటం, జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ మరియు సంగీత రంగ ప్రముఖుల ప్రత్యేక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు."ఏపీఎల్2026 కేవలం ఒక క్రికెట్ టోర్నీ కాదు, "నవ్యాంధ్ర ...క్రీడా ప్రగతికి నాంది!" అని వివరించారు. పరిమిత వనరులతో ప్రారంభమైన ఏపీఎల్ నేడు రాష్ట్ర క్రీడా ప్రతిభను వెలికితీసే గొప్ప వేదికగా ఎదిగిందని చిన్ని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా అత్యుత్తమ ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు.మీడియా, క్రీడాభిమానులు, ప్రజలు కలిసి వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

## ప్రమాదానికి గురైన విలేఖరి ఆలీని పరామర్శించిన రిటైర్డ్ సైనికుడు సైదా

సత్తెనపల్లి టౌన్ జూన్ 7ప్రభాతవార్త : నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సామాజిక నాయకులు ఎస్.ఎం. సైదా మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. గతంలో దేశ సరిహద్దుల్లో సైనికుడిగా సేవలు



అందిస్తూ, దేశ రక్షణ కోసం ఎన్నో యుద్ధాలలో పాల్గొన్న వీరజవాన్ అయిన ఎస్.ఎం. సైదా, పదవీ విరమణ తర్వాత కూడా అదే సేవా భావంతో సమాజం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. గత జనవరి నెలలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, గత ఐదు నెలలుగా ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్న స్థానిక విలేఖరి అలీని ఆయన ఆదివారం పరామర్శించారు. అలీ నివాసానికి వెళ్లిన ఎస్.ఎం. సైదా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన నాటి నుండి నేటి వరకు ఎదుర్కొన్న ఇబ్బందులను, అందుతున్న వైద్య సహాయాన్ని అడిగి వాకబు చేశారు.

## సీఐగా ఉద్యోగోన్నతి పొందిన ఎస్సై చిరుమావిళ్ల వెంకట్ కు అభినందన

మంగళగిరి, జూన్ 7, ప్రభాతవార్త : మంగళగిరి రూరల్ ఎస్సైగా పనిచేస్తూ సీఐగా ఉద్యోగన్నతి పొందిన ఎస్సై చిరుమావిళ్ల వెంకట్ ను స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ లో పలువురు దేశం తమ్ముళ్ల కలిసి అభినందించారు. నాయకులు, ఎస్సై చిరుమామిళ్లను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు.



అనంతరం వారు మాట్లాడారు. రూరల్ ఎస్సైగా చిరుమావిళ్ల శాంతిభద్రతలు కాపాడడంలో ఎంతో కృషి చేశారన్నారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకితభావం, కృషి పట్టుదలతో ముందుకు వెళుతూ పోలీస్ శాఖలో పలువురికి ఆదర్శనీయంగా ఉంటున్న వెంకట్ సేవలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో చిరుమావిళ్ల ఉద్యోగ నిర్వహణలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. టీడీపీ గుంటూరు జిల్లా పద్మశాలి సాధికార సమితి ప్రధాన కార్యదర్శి జొన్నాదుల బాలకృష్ణ, పట్టణ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్, టీడీపీ నాయకులు జింకా మల్లేశ్వరరావు, ఆకురాతి రామ్, లక్ష్మణ్ తదితరులు చిరుమావిళ్లకు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

## యోగాను జీవనశైలిగా మార్చుకుంటే ఆరోగ్యమే మహాభాగ్యం

క్రోసూరు, జూన్ 7 ప్రభాతవార్త: యోగాను వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు కోసం జీవన శైలిలో భాగంగా చేసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ పిలుపునిచ్చారు. యోగ సాధన




ద్వారా ఆరోగ్యము మెరుగుపడటమే కాకుండా మానసిక చురుకుదనం, నాణ్యమైన నిద్ర, ఉత్పాదకత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. యోగాంధ్ర2026 కార్యక్రమంలో భాగంగా ఆదివారం క్రోసూరు మండలంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు ప్రారంభం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్రోసూరు లో ఆయన మాట్లాడారు. ఇతర వ్యాయామాలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక అప్రమత్తత, శ్వాసక్రియ నియంత్రణ, రక్తప్రసరణ మెరుగుపడతాయని వివరించారు. యోగా వల్ల నాణ్యమైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ, శరీరంలోని అవయవాల పనితీరు మెరుగుపడతాయని తెలిపారు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా శాశ్వత ఆరోగ్య జీవనశైలిగా అలవర్చుకోవాలని శాంసన్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన యోగా కార్యక్రమాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

## ఆకుల జయ సత్య దంపతులకు సత్కారం

మంగళగిరి, జూన్ 7, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు ఆకుల జయసత్య ను ఎర్రబాలెం బసవతారక నగర్ లో గల శ్రీ షిరిడి సాయిబాబా మందిరం సేవ ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ముందుగా ఆకుల జయసత్య దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం మందిరం ప్రెసిడెంట్ నామాల మోహన్ బాబు



మాట్లాడుతూ. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఆకుల జయ సత్య చేసిన కృషిని గుర్తించి ఆ పార్టీ అధిష్టానం రాష్ట్ర కార్యదర్శి గా, గన్నవరం నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నతమైన పదవులు అందించటం ఆనందనీయమన్నారు. ఆలయానికి సంబంధించిన అభివృద్ధి తదితర అంశాలపై ఆమె అడిగి తెలుసుకొని సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు, ఆకుల కుటుంబానికి ఎల్లప్పుడూ శ్రీ శిరిడి సాయిబాబా ఆశీస్సులు ఉంటాయని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మందిరం ట్రస్ట్ సభ్యులు పి భవాని, ఎం పార్వతి, ఉషారాణి, సూర్య కళ, కే రంగారావు, కే రాజా, ఎం సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెదనందిపాడు జూన్ 7 (ప్రభాతవార్త): మధుర జ్ఞాపకాల మళ్ళీ కలయిక. మత్తెక్కించే మల్లెలైనా వాడిపోతాయి.. గుభాళీ చే గులాబీలైన రాలిపోతాయి.. కానీ.. స్నేహ పుష్పాలు జీవితాంతం వికసిస్తూనే ఉంటాయి.. సమీపంలోని సందెపూడి శ్రీ చండి హనుమాయమ్మ - హనుమంతరాయుడు జడ్.పి.హెచ్. హైస్కూల్ లో 1988.89 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగినది . 37 సంవత్సరాల అనంతరం బాల్యస్నేహాలు, పాఠశాల జ్ఞాపకాలు, గురువుల ఆశీస్సులు, అనుబంధాల పరిమళాలను మరోసారి మనసారా ఆస్వాదించిన నాటి విద్యార్థుల అపూర్వ వేడుకగా సందెపూడి లో నాటి విద్యార్థులు గుర్రం రవీంద్ర . కందిమళ్ళ సుజాత ల ఆర్గనైజేషన్ లో ఆనాటి విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది.కాలం ఎన్నో మార్పులు తీసుకొచ్చినా, మన హృదయాల్లో పదిలంగా నిలిచిన పాఠశాల రోజుల జ్ఞాపకాలు ఈ రోజు మళ్లీ



సజీవమయ్యాయి అని. ఒకే తరగతి గదిలో కలలు కనిన మిత్రులు, జీవిత ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లు దాటి తిరిగి ఒకే వేదికపై కలుసుకోవడం ప్రతి ఒక్కరికీ భావోద్వేగభరితమైన అనుభూతిని కలిగించింది. తమ ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేసిన గుర్రం కుమారస్వామి మంగమ్మ లుతమ అమూల్యమైన సందేశాలతో నాది విద్యార్థులను ఆశీర్వదించారు.ముప్పాళ్ల పూర్ణచంద్రరావు. స్టీఫెన్ పాల్‌పి. చంద్రయ్య . ముప్పాళ్ల వీరప్పయ్య .గద్దె సత్యనారాయణ తమ బోధనా రోజుల నాటి మధుర స్మృతులను పంచుకుంటూ నేటి తరానికి విలువలు, క్రమశిక్షణ, శారీరక శ్రమ ప్రాముఖ్యతను గుర్తుచేశారు.ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన కోనూరి సాంబశివరావు.కొండా శ్రీనివాసరావు ప్రస్తుత ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు. విద్యాధరి పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్నగురువులు. అతిథులందరినీ నాటి విద్యార్థుల బృందం ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం బ్యాచ్ మేట్స్ అందరూ తమ కుటుంబ, వృత్తి జీవిత విశేషాలను పంచుకుంటూ, బాల్యస్మృతులను గుర్తుచేసుకుంటూ నేటి రోజున ఆనందోత్సాహాలతో గడిపారు.37 సంవత్సరాల అనంతరం మళ్లీ తమ పాఠశాల ప్రాంగణంలో అడుగుపెట్టిన ఆ క్షణాలు ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మధురానుభూతులుగా మారాయి.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి సహచర మిత్రునికి, గౌరవనీయ గురువులకు, విచ్చేసిన అతిథులకు, అలాగే ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయినా తమ ప్రేమాభిమానాలను పంచుకున్న మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసుకోవడం జరిగిందని నాటి బ్యాచ్ విద్యార్థి నేటి పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి వీరరాఘవయ్య తెలిపారు

## అన్నపరెడ్డి పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల

ముప్పాళ్ల జూన్ 7 ప్రభాతవార్త: ముప్పాళ్ళ మండలం కుందురు వారి పాలెం గ్రామంలో అన్నపరెడ్డి వెంకటరెడ్డి నాగలక్ష్మి కుమార్తె పూజ పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించిన



సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి. ఈ కార్యక్రమంలో నాయకులు మాలూరి జగన్మోహన్ రామలింగారెడ్డి , ఇందూరి నరసింహారెడ్డి , రెండేద్దుల వెంకటేశ్వర్ రెడ్డి , సైకం వెంకటప్ప రెడ్డి , కుందూరు శ్రీనివాస్ రెడ్డి , సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు ఛానల్ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే

వట్టిచెరుకూరు, జూన్ 7, ప్రభాతవార్త : ప్రత్తిపాడు మండల పరిధిలోని కొండెపాడు గ్రామంలో జరుగుతున్న గుంటూరు ఛానల్ పొడిగింపు పనులను కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మ సాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేడాక్టర్ బూర్ల రామాంజనేయులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ..గుంటూరు ఛానల్



ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే రెండేళ్లలో ఛానల్ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఛానల్ పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే రైతులతో మాట్లాడారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, గుంటూరు రూరల్, వట్టిచెరుకూరు మండలాలను కలుపుతూ 1972 సంవత్సరంలో ఈ కాలువను నిర్మించారని చెప్పారు. ప్రస్తుతం 47 కి.మీ పొడవుతో ఉన్న ఈ కాలువ 600 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో సుమారు 27 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని వివరించారు. పెరుగుతున్న జనాభా, భూ విస్తీర్ణం, తదితర అవసరాలకు అనుగుణంగా కాలువ విస్తరణ, ఆధునికీకరణ అత్యవసరమైందని చెప్పారు. 1972లో నిర్మించిన పాత కల్వర్టులు, గేట్లు, వంతెనలు శిథిలావస్థకు చేరడం, మురుగునీరు కాలువలో కలవడం వంటి సమస్యల పరిష్కారానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నారా చంద్రబాబు నాయుడు 2017 18 సంవత్సరంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ కాలువ ఆధునీకరణకు రూ.250 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుతం కాలువ నిర్మాణ భూసేకరణ కోసం రూ.100 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.28 కోట్లకు పైగా రైతులకు పరిహారం విడుదల చేసినట్లు వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు న్యాయం చేసే చర్యలు చేపట్టామని చెప్పారు. కొత్త టెండర్ల కారణంగా ఆలస్యం, అదనపు వ్యయభారం లేకుండా పాత ఒప్పందాల ప్రకారమే పనులు కొనసాగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు సూచించిన సమస్యలను పరిశీలించి కాలువ తవ్వకాల నుంచి వచ్చిన మట్టి తిరిగి కాలువలోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గట్టు నిర్మాణం వల్ల పొలాల్లో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా అవసరమైన డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలన్నారు.

కాలువ తవ్వకాల నుంచి వచ్చిన మట్టి స్థానిక రైతుల అవసరాలకే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు తరలించరాదని స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ ఈ ప్రాంత రైతుల ఎన్నో ఏళ్ల కల అని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ పనులను నిరంతరంగా కొనసాగించి రైతులకు పూర్తి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్లు అయినపూడి నాగేశ్వరరావు, కల్లూరి కుసుమ, ఏపీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కాసు పెంటారెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షుడు, నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

తెనాలి జూన్7(ప్రభాతవార్త): జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో,జంగమ సంఘ విద్యార్థులకు నోట్ బుక్స్, స్కాలర్ షిప్ లు పంపిణీ చేశారు. ఆదివారం పట్టణం లోని నందులపేట, నేషనల్ క్లబ్ రోడ్ లోని జంగమ సంక్షేమ సంఘం ఆఫీసు నందు జంగమ సంఘం లోని విద్యార్థులకు నోట్ బుక్స్




మరియు స్కాలర్ షిప్ లు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని గత 13 సంవత్సరాల నుండి పంపిణీ చేస్తున్నట్టు అధ్యక్షులు కె.వి.ఎస్. నాగలింగం తెలియచేశారు.ఈ నోట్ బుక్స్ పంపిణీని తెనాలి డివిజన్ లోని జంగమ విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ఈకార్యక్రమంలో, అధ్యక్షులు కె.వి.ఎస్. నాగలింగం, కార్యదర్శి. సిద్ధుల సాయినాథ్, కోశాధికారి ప్రత్తిపాటి సురేష్ బాబు, కార్యనిర్వహణ కార్యదర్శి సోము లక్ష్మణ్,మరియు కార్యవర్గ సభ్యులు, వీడియాల కరుణాకర్, సామిదాల జయశ్రీ,, కాకుమాను వినోద్, దోగిపర్తి శ్రీను. పెయేటి నందు,పలువురు జంగమ సంక్షేమ సంఘం ప్రముఖులు,పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డిప్యూటీ సిఎం పవన్‌ను కలిసిన 'చిల్లపల్లి'

మంగళగిరి, జూన్ 7, ప్రభాతవార్త : మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తో ఏపీ ఎంఎస్ ఐ డి సి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలో నూతన కమిటీలు ఏర్పాటు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు తదితర ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీని గ్రామ స్థాయి నుండి మరింత శక్తివంతంగా తీర్చిదిద్దే దిశగా అవసరమైన పలు సూచనలు, మార్గదర్శకాలను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చిల్లపల్లి శ్రీనివాసరావు కు సూచించారు.



## యర్రబాలెంలో తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

మంగళగిరి, జూన్ 7, ప్రభాతవార్త: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి భారీ సొత్తును అపహరించిన ఘటన మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఎర్రబాలెం గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. యర్రబాలెం రామాలయం సమీపంలోని నివాసముంటున్న కానుకొలను సుబ్బారావు, వెంకటేశ్వరమ్మ దంపతులు తన కుమారుడు, కోడలితో కలసి జీవనం సాగిస్తున్నారు. కుటుంబ యజమాని సుబ్బారావు కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా కుమారుడు నవీన్ ఓ ప్రభుత్వ రంగ సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిసంస్థలోన్నాడు. ఈ నేపథ్యం లో శనివారం రాత్రి 11 గంటల సమయంలో సుబ్బారావు తన భార్య వెంకటేశ్వరమ్మ తో కలసి పెనుగంచిప్రోలు లోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవస్థానంలో మొక్కు కార్యక్రమానికి వెళ్లారు. అంతకు ముందు వారి కుమారుడు నవీన్ అదే గ్రామం లోని అత్త గారి ఇంటికి వెళ్ళాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి చోరికి పాల్పడ్డారు. బీరువా లో దాచిన సుమారు రూ. 5 లక్షల విలువైన ఆరు కాసుల బంగారు నల్ల పూసల గొలుసు, బంగారు చెవి దుద్దులు, సుమారు రూ. 2 లక్షల విలువైన పలు వెండి వస్తువులతో పాటు లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడో తేదీ ఉదయం ఆరు గంటల సమయంలో కుమారుడు నవీన్ ఇంటికి వచ్చాడు. బయట గేటుకు వేసిన తాళాలు తీసి లోపలికి వెళ్ళాడు. లోపలి తలుపుకు వేసిన తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన నవీన్ గదిలోకి వెళ్ళి చూడగా బీరువా తాళాలు కూడా పగులగొట్టి అందులోని పలు పత్రాలు మంచం పై చిందర వందరగా పడి ఉన్నాయి. మరో గదిలో మంచం పై గడ్డ పలుగు ఉంది. గుర్తు తెలియని దుండగుడు ఇంటి వెనుక నుంచి గోడ దూకి వచ్చి ఇంట్లో ఉన్న గడ్డ పలుగు సహాయంతో తలుపు తాళాలు పగులగొట్టి చోరికి పాల్పడినట్లు నవీన్ తెలిపారు. చోరీ ఘటనపై కాల్ చేసి సమాచారం అందించడంతో మంగళగిరి రూరల్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని క్లూస్ టీం ను రప్పించి ఆధారాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం: మంత్రి నాదెండ్ల

తెనాలి జూన్7(ప్రభాతవార్త): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఆదివారం తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి



నాదెండ్ల మనోహర్ ప్రజలను కలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి పలు అంశాలకు సంబంధించిన వినతి పత్రాలను మంత్రి స్వయంగా స్వీకరించారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టాలను తీర్చడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.మంత్రి వెంట కూటమి ప్రభుత్వ నాయకులు, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెనాలి అగ్నిమాపక కేంద్రానికి నూతన వాహనం

తెనాలి మున్సిపాలిటీ జూన్7(ప్రభాతవార్త): ఇప్పటివరకు ఒక్క ఫైర్ ఇంజన్ వాహనంతోనే నెట్టుకొస్తున్న తెనాలి అగ్నిమాపక కేంద్రానికి, స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ



మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో రెండవ ఫైర్ ఇంజన్ వాహనం ప్రభుత్వం కేటాయించింది. గత 13 సంవత్సరాలుగా తెనాలి అగ్నిమాపక కేంద్రం ఒక్క ఫైర్ ఇంజన్ వాహనంతోనే నెట్టుకొస్తుంది. గత మే నెలలో ఒకేసారి రెండు వేరువేరు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే, ఒక ఫైర్ ఇంజన్ తో ఒకదాని తర్వాత ఒకటి ప్రమాదాల నివారణకు సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గత ఏప్రిల్ నెలలో రెండవ వాహనం మంజూరైన తిరిగి వెళ్ళిపోయింది.ఈ సందర్భంగా రెండో వాహనం కేటాయించటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నిమ్మగడ్డ వెంకట సుబ్బారావుకు అరుదైన గౌరవ డాక్టరేట్

పెదనందిపాడు జూన్ 7 (ప్రభాతవార్త) గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామానికి చెందిన అడ్వకేట్, నోటరీ మరియు హోమియో డాక్టర్ నిమ్మగడ్డ వెంకట సుబ్బారావు అమెరికాలోని కాలిఫోర్నియా పబ్లిక్ యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయటం జరిగినది. వారు తమ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ను ఎమ్మెస్సీ సైకాలజీ లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి ప్రథమశ్రేణిలో పూర్తి చేశారు. తదుపరి వారు ఎన్నో సంవత్సరాల




నుండి వివిధ రకాల సెమినార్స్ మరియు ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ లో పాల్గొనడమే కాకుండా ఎం ఏ ప్రభుత్వపాలానాశాస్త్రం, ఎం ఏ రాజనీతిశాస్త్రం, ఎం ఏ తత్వశాస్త్రం, ఎం ఏ చరిత్ర, ఎం ఏ తెలుగు, ఎం ఏ సంస్కృతం, ఎం ఏ ఇంగ్లీష్, ఎం ఏసామాజికశాస్త్రం, ఎం ఏ భగవద్గీత మరియు అనేక అంశాల మీద బుర్రకథలు, సంగీతంలో ప్రావీణ్యమే గాక తమ గృహంలోనే హార్మోనియం బాక్స్ ని సొంత ఖర్చులతో చేయించి చుట్టుప్రక్కల గల పౌరాణిక కళాకారులకు ఉచితంగా సంగీత సాధనలో తర్ఫీదును ఇస్తూ, నాటకాల పాత్రలు ప్రదర్శించడం తోపాటు, కారాటే లో బ్లాకబెల్ట్, కర్రసాము లాంటి ఆత్మరక్షణ విద్యాలో నైపుణ్యంసాధించి, అనేకమంది ఔత్సాహికులకు ఉచిత శిక్షణ ఇవ్వటం ద్వారా సమాజాభివృద్ధికి పాటు పడ్డారు. సైకాలజీలో వారు స్థానిక పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య పర్యవేక్షణ లో సమర్పించిన. పరిశోధనా గ్రంథం. మనస్తత్వశాస్త్రం. 21వ శతాబ్దంలో మనస్సు, ప్రవర్తన మరియు శ్రేయస్సునకు గాను వారికి అమెరికాలోని కాలిఫోర్నియా పబ్లిక్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేటును ( ..బ్బ్బ్బ్బ్బ్బ శ్రీ.దీ.. ) ప్రకటించిటం జరిగినది. ఈ సందర్భంగా తమిళనాడు లోని "పెరంబలూరు " లో స్థాపించిన వారి అనుబంధ సంస్థ " ..డి.కె ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్.. " లో ఈనెల 6 శనివారం రాత్రి జరిగిన "ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ డెవలప్మెంట్ కమ్ కాన్వకేషన్ ఫంక్షన్" లో గౌరవ డాక్టరేట్ డిగ్రీని అందుకోవటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ డాక్టర్. రఘునాథ్ పరక్కల్, వైస్ ఛాన్సెలర్ బ్రెయినిక్ యూనివర్సిటీ, డెలావర్ (అమెరికా ), ప్రొఫెసర్ డాక్టర్. క్రిశాంత పతిరాజ, అడ్వైసరీ పానెల్ మెంబెర్, మినిస్టరీ ఆఫ్ ఎడ్యుకేషన్, హయ్యర్ ఎడ్యుకేషన్, ఒకేషనల్ ట్రెనింగ్, గవెర్నమెంట్ ఆఫ్ శ్రీలంక, డైరెక్టర్, హెచ్చిఎఫ్సి బ్యాంక్. శ్రీలంక. డాక్టర్. సునీత కె క్రోసూరి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మిలీనియం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్, యు ఎస్ డాక్టర్. తానసేన్ చౌదరి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డి ఎన్ సిఇంజనీరింగ్, ఎల్ ఎల్ సి, కాలిఫోర్నియ, యుఎస్. వారు హాజరైనారు. అనేకమంది ప్రేమికుల మధ్య అవార్డు అందుకున్న నిమ్మగడ్డ వెంకట సుబ్బారావు కు.సహచర న్యాయవాదులు, ఫ్రెండ్స్ . కుటుంబ సన్నిహితులు. పలువురు ప్రముఖులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## అశోక స్కూల్ విద్యార్థి ప్రత్యూషకు జాతీయస్థాయి అవార్డు

పెదనందిపాడు జూన్ 7 (ప్రభాతవార్త): హార్ట్ ఫుల్ నెస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ శ్రీ రామచంద్ర మిషన్ గుంటూరు వారు. ది కామన్ వెల్త్ గ్లోబల్ ఫౌండేషన్ సహకారంతో అంతర్జాతీయ స్థాయిలో ఆన్లైన్లో



ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పెదనందిపాడు అశోక స్కూల్ 10వ తరగతి విద్యార్థి నల్లూరి ప్రత్యూష జాతీయస్థాయిలో నాలుగో స్థానం సాధించింది. నేడు ఆదివారం గుంటూరులో హార్ట్ ఫుల్ నెస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపల్ ఎన్. రామారావు ప్రత్యూషను అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు ధ్యానం చేసినచో ఒత్తిడిని అధిగమించి బాగా చదువుకొని ర్యాంకులు సాధించవచ్చు అన్నారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమైన ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ సాధించుటకు మనమందరము కృషి చేయాలన్నారు. ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా డేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్ సి.ఎస్ రామ కోటేశ్వరరావు. పద్మజ. సుజాత. శైలజ .అశోక స్కూల్ కరస్పాండెంట్ పోపురి లక్ష్మీనారాయణ .డైరెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సవం..39ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

వట్టిచెరుకూరు, జూన్ 7, ప్రభాతవార్త: మండలంలోని మేజర్ పంచాయతీ ముట్లూరు గ్రామంలో ఉన్న సెయింట్ జేవియర్స్ ఉన్నత పాఠశాలలో 19871988 బ్యాచ్ కు చెందిన పదోవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ వద్ద ఉన్న వివాహ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రారంభంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ..మేము ముట్లూరు గ్రామంలో పదవ తరగతి పూర్తయిన తర్వాత మళ్లీ 39




సంవత్సరాల తరువాత ఈ విధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మేము ఈ రోజు ఇంత గొప్ప స్థాయికి రావడానికి మా గురువులే కారణమని ఉద్ఘాటించారు. త్రిమూర్తులు అంటే తల్లి, తండ్రి, గురువు అని, మేము గురుదక్షణ కింద వారికి ఏమిచ్చినా కాని వారి రుణం తీర్చుకోలేమన్నారు. ప్రతి వ్యక్తి తన జీవితంలో కత్తిపోటు తప్పినా గాని కలంపోటు తప్పదన్నారు. ఒక ఆఫీస్ లో చిన్న అటెండర్ స్థాయి నుంచి ఐఎఎస్ వరకు, దేశ అత్యున్నత పదవి అయిన ప్రధాని, రాష్ట్రపతి వరకు ఎవరైనా పాఠశాలకు వెళ్లకుండా గురువుల చేత విద్యాబుద్ధులు అభ్యసించకుండా ఏమి సాధించలేమని వివరించారు. అప్పటి గురువులు శౌరీలు, నాదెండ్ల అప్పారావు, గోరంట్ల ప్రేమయ్య, అంతయ్య, సుందర్రావు, రవీంద్ర మాట్లాడుతూ..చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ పూర్వ విద్యార్థులందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు పూల మాలలు, శాలువాలు, మొమెంటోలతో ఘనంగా సత్కరించారు.

వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆనాటి పాఠశాల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాదెండ్ల అప్పారావు మాస్టారు ఈ సన్మానం 136వదిగా తెలియజేశారు. అప్పారావు మధురమైన కంఠస్వరముతో నాటక, సినీ డైలాగులతో అందరినీ అలరింప చేశాడు. ప్రారంభంలో విద్యాబుద్ధులు నేర్పి మృతి చెందిన గురువులకు, తోటి విద్యార్థులకు ఒక నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కొల్లిమర్ల కృష్ణ కిషోర్, వియ్యాల మోహన గుప్తా, మందగిరి మరీలు, పద్మజ, నీరజ, షేక్ జాన్ బాషా, వెంకటసుబ్బమ్మ, ఉయ్యూరు శ్రీనివాసరావు, తోటకూర శివయ్య, పత్తి రమేష్, తదితర పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు

## తెనాలిలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు : పట్టించుకోని అధికారులు

తెనాలి మున్సిపాలిటీ జూన్7(ప్రభాతవార్త): తెనాలి పట్టణంలోని నాజరుపేట,మల్లాది వారి వీధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గత పది రోజులుగా అందులో నుంచి నిప్పురవ్వలు వస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్లాది వారి వీధిలోని విద్యుత్ స్తంభంపై అమర్చిన ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఇన్సులేటర్లు దెబ్బతిని వైర్లు స్పార్క్ అవుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో, వర్షం పడే సమయంలో పెద్ద శబ్దాలతో నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. "గత పది రోజులుగా ఇదే



పరిస్థితి. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఖిచూస్తాం, చేస్తాంఖి అని చెప్పడం తప్ప చర్యలు శూన్యం" అని వీధివాసులు వాపోతున్నారు. ట్రాన్స్ ఫార్మర్ కింద నుంచి నిత్యం పిల్లలు, వృద్ధులు నడిచి వెళ్తుంటారు. అలాగే సమీపంలోనే ఇళ్లు, చెట్లు ఉండడంతో పెను ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేదంటే కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏదైనా ప్రాణ నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ఘనంగా అన్న ప్రసాద వితరణ

నిజాంపట్నం, జూన్ 7, ప్రభాతవార్తః ప్రతి ఒక్కరూ దైవం పట్ల భక్తి, భయం కలిగి ఉండాలని మంత్రి సోదరుడు శివప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన నిజాంపట్నం గ్రామ దేవత శ్రీ మొగదారమ్మ తల్లి శిడిమాను ఉత్సవాల అనంతరం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవానుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు, మోపిదేవి హరనాథ్, తెదెపా,కూటమి నాయకులు, కార్యకర్తలు, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

